

ఈ రేస్‌పై చర్చకు పట్టుబడుతూ శాసనసభలో స్పీకర్ పోడియం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులను తప్పుబడుతూ శాసనమండలి ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్సీలు

కేటీఆర్‌పై కేసు అక్రమం

ఫార్ములా ఈ-కార్ రేస్‌పై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ • దద్దరిల్లిన ఉభయసభలు.. పోడియం ఎదుట ఆందోళన

చర్చకు అనుమతించని స్పీకర్, మండలి చైర్మన్ • అసెంబ్లీ, మండలిలో పట్టువీడని బీఆర్ఎస్ సభ్యులు

హోరెత్తిన నినాదాలు.. ఒకటికి రెండుసార్లు వాయిదా • అసెంబ్లీలో నిరసనల మధ్యనే పొంగులేటి ప్రసంగం

అసెంబ్లీలో పోటాపోటీగా అధికార, ప్రతిపక్షాల నినాదాలు • శాసన మండలిలో చేతులెత్తేసిన సర్కార్.. సభ నేటికి వాయిదా

- **మేం తప్ప చేయలేదు.. రాష్ట్రం కోసమే పనిచేశాం**
- **తప్ప అంటున్నవారు చర్చ పెట్టి అదేమిటో చెప్పండి**
- **ఎమ్మెల్యే కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టారు**
- **ఆయనకు చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి**
- **అసెంబ్లీలో హరీశ్‌రావు డిమాండ్**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసు శుక్రవారం ఉభయసభల్లో ప్రకంపనలు సృష్టించింది. కేసుపై చర్చించాలని పట్టుబడుతూ బీఆర్ఎస్ సభ్యులు చేపట్టిన ఆందోళనలతో శాసనసభ, శాసనమండలి దద్దరిల్లాయి. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనల మధ్యనే భూ భారతి బిల్లుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించగా, మండలిలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడంలో అధికారపార్టీ పూర్తిగా విఫలమైంది. మండలిలో శుక్రవారం మూడు బిల్లులను ప్రవేశపెట్టాల్సి ఉండగా, ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది. కేటీఆర్‌పై కేసును నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉభయసభలకు హాజరయ్యారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చించాలని ఉభయసభల్లోనూ పట్టుబట్టి, సభను అడ్డుకున్నారు. దీంతో ఒకటికి రెండుసార్లు ఉభయసభలు వాయిదాపడ్డాయి. శాసనమండలిలో మూడోసారి సమావేశమైన తరువాత కూడా సభ అదుపులోకి రాకపోవడంతో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు.

దమ్ముంటే ఉంటే చర్చపెట్టండి

శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకాగానే భూభారతిపై చర్చను చేపట్టనున్నట్టు స్పీకర్ ప్రకటించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మాట్లాడే అవకాశమిచ్చారు. ఈ-కార్ రేసింగ్‌పై చర్చను అనుమతించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. రెండు చేతులెత్తి దండం పెడుతూ.. 'స్పీకర్ సార్ చర్చకు అనుమతించండి' అని విజ్ఞప్తి చేశారు. 'ప్రశ్నోత్తరాలు ఎలాగూ లేవు. రాత్రి 12 గంటల వరకు చర్చిద్దాం.. ఈ-కార్ రేసింగ్‌పై చర్చకు అనుమతించాలి' అని కోరారు. ప్రభుత్వానికి దమ్ము, చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. అయినా స్పీకర్ అనుమతించలేదు.

కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసేందుకే

కేటీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేసి బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీ నడిచే సమయంలో ఒక ఎమ్మెల్యేపై అక్రమ కేసు పెట్టారని, ఫార్ములా-ఈ కార్ రేస్‌పై చర్చకు స్పీకర్ చాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఫార్ములా-ఈ కార్ రేస్ అంశంలో రకరకాల లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము తప్పు చేశామంటున్నారని, సభలో చర్చించి అదేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తాము చేసింది ఎందుకు తప్పుకాదో ఈ సభ ద్వారా తాము కూడా ప్రజలకు చెప్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెట్టింది అక్రమ కేసు కాకుంటే సభలో చర్చించాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం ముందు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు.

కొనసాగిన ఆందోళన..

మళ్లీ సభ ప్రారంభంకాగానే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బీఆర్ఎస్ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేశారు. భూ భారతిపై చర్చ అనంతరం తన చాంబర్‌కు పిలిపించి మాట్లాడతానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ సభ్యులు శాంతించలేదు. ఇదే సమయంలో మంత్రి పొంగులేటికి స్పీకర్ మాట్లాడే అవకాశమిచ్చారు. భూ భారతిపై మంత్రి పొంగులేటి మాట్లాడారు. ఆ తర్వాత బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతున్నప్పుడు 'బడే భాయ్.. ఛోటే భాయ్' అంటూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను వాయిదావేశారు. విరామం తర్వాత అసెంబ్లీ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. నిరసనగా బయటకు వెళ్లిపోయారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆందోళన

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనకు పోటీగా అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. కొందరు సభ్యులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సీట్ల వైపు దూసుకొచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అత్యంత వేగంగా హరీశ్‌రావును సమీపించారు. 55 మంది మార్షల్స్ సభలో మోహరించారు.

ఆ ఎమ్మెల్యే వైఖరి వివాదాస్పదం

సభలో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరయ్య వైఖరి వివాదాస్పదమైంది. ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆయన పేపర్ విసిరే ప్రయత్నం చేస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఆ తర్వాత ఆయన చెప్పు తీసి విసరబోయారని, వాటర్ బాటిల్ విసిరేయబోయారంటూ సోషల్ మీడియాలో వార్తలొచ్చాయి. ఇటీవలే వీర్లపల్లి శంకరయ్య వెలమ కులంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భౌతిక దాడులకు దిగుతామని బెదిరించారు. 'వెలమల్లారా ఖబర్దార్.. కుట్రలు చేసే వెలమల వీపులు విమానాలు మోగుతాయ'ంటూ అసభ్య పదజాలంతో దూషించారు. ఈ నేపథ్యంలో తాజా వివాదం మొదలైంది.

మండలిలో చేతులెత్తేసిన సర్కార్

- **పది నిమిషాలైనా సాగకుండానే సభ వాయిదా**
- **మూడు బిల్లులు ప్రవేశపెట్టలేకపోయిన ప్రభుత్వం**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలంటూ బీఆర్ఎస్ సభ్యులు చేసిన ఆందోళనలతో శాసనమండలి దద్దరిల్లింది. ఒకటికి రెండుసార్లు సభను వాయిదా వేసినా పరిస్థితి అదుపులోకి రావడంతో చివరకు ఏ చర్చా జరగకుండానే మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభను శనివారానికి వాయిదా వేశారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలతో హాజరైన బీఆర్ఎస్ సభ్యులు సమావేశాన్ని స్థంభింపచేశారు. కేటీఆర్‌పై పెట్టిన ఫార్ములా-ఈ రేస్ కేసును ఎత్తివేయాలని ఆందోళనకు దిగారు. సభ సాగకపోవడంతో చైర్మన్ తొలుత 15 నిమిషాలపాటు వాయిదా వేశారు. ఉదయం 11:20 గంటలకు మండలి సమావేశం తిరిగి ప్రారంభమైనప్పటికీ, బీఆర్ఎస్ ఆందోళనలకు దిగింది. చర్చ లేకుండానే చైర్మన్ సభను శనివారానికి వాయిదా వేశారు. బీఆర్ఎస్ సభ్యులు మీడియా పాయింట్ వద్ద నిరసన తెలిపారు.

చైర్మన్ వారించినా

కేటీఆర్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలని సభలో చర్చ పెట్టాలన్న డిమాండ్లతో ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ సభ్యులను మండలి చైర్మన్ వారించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు వెనక్కి తగ్గలేదు. కేసుపై చర్చ జరగాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో చైర్మన్, మంత్రులు నిశ్చేష్టులయ్యారు.

లోకం పోకడ



ఐదేళ్లలో ఆరు గ్యారంటీలు అమలు చేయడం ఎలా? పుస్తకం వుందా?

విపక్షాలకు మైక్ కట్

- **మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడ్తరు**
- **కొత్త రూల్.. అంటూ పోలీసుల దబాయింపు**
- **అధికారపక్షానికి మాత్రం అన్ని అనుమతులు**
- **బీఆర్ఎస్ సభ్యులకు అడుగడుగునా ఆంక్షలే..**

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అధికారపక్షం ఏది చేసినా ఒప్పే.. ప్రతిపక్షం ఏది చేసినా తప్పే.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నది కాంగ్రెస్ సర్కారు. శాసనసభలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. సభలో, మీడియా పాయింట్ వద్ద మాట్లాడే విషయంలో, నిరసన తెలిపే అంశంలో ఈ వ్యత్యాసాలు స్పష్టంగా కనిపించాయి. శాసనసభలో తమ అభిప్రాయం చెప్పేందుకు విపక్షాలకు మైక్ ఇవ్వకుండా గొంతు నొక్కేస్తున్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు బీఆర్ఎస్ సభ్యులు మీడియా ఎదుట వాపోయారు. సభను వాకౌట్‌చేసి మీడియా పాయింట్ వద్ద మాట్లాడేందుకూ విపక్షానికి అవకాశం ఇవ్వడం లేదు. కొత్త రూల్ అంటూ పోలీసులు అడ్డుకుంటున్నారు. శుక్రవారం సభను వాకౌట్ చేసిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్దకు వస్తుండగా.. పది మంది మార్షల్స్ అడ్డుకున్నారు. వాకౌట్‌కు కారణాలు, సభలో పరిస్థితులపై మీడియా ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లో ప్రధాన ప్రతిపక్షం గొంతు వినిపించకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అంటున్నారు. అధికారంలో ఉండి కూడా అటు సభలో, ఇటు మీడియా పాయింట్‌లోనూ వాళ్లే మాట్లాడుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసమో అధికారపక్ష ఎమ్మెల్యేలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచిస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపడంపైనా సర్కారు ఆంక్షలు విధిస్తున్నది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన, డిసెంబర్ 20 : ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ డీఎస్పీ ఏ కరుణాకర్ సూచించారు. శుక్రవారం రాత్రి పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా గోండుగూడ గ్రామంలో గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లకు వచ్చే ప్రతి కాల్ ఎత్తవద్దని, తెలిసిన వారి కాల్స్ మాత్రమే లిఫ్ట్ చేయాలని, బ్యాంక్ విషయాలు గానీ, వ్యక్తిగత విషయాలు గానీ చెప్పవద్దని సూచించారు. అలాగే ఫోన్‌కు వచ్చే లింక్‌లు ఓపెన్ చేయవద్దని తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ బుద్ధె స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్, గ్రామపెద్ద జంగుపటేల్, గ్రామస్తులు సురేశ్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

గోండుగూడ లో దుప్పట్లు పంపిణి చేస్తున్న ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, సీఐ , ఎస్ఐ

ట్రై సైకిళ్ల పంపిణీ ఎప్పుడో..



మండల పరిషత్ కార్యాలయంలో మూడు చక్రాల పరికరాలు

నార్నూర్, డిసెంబర్ 18 : నార్నూర్‌లోని జడ్పీ పాఠశాలలో జిల్లా దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిల్ అందించేందుకు శిబిరం నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. నార్నూర్, గాదిగూడ మండలం నుంచి దివ్యాంగులు దరఖాస్తులు చేసుకున్నారు. దివ్యాంగులను గుర్తించి ట్రై సైకిల్ పరికరాలు రెండు నెలల క్రితమే మండల పరిషత్ కార్యాలయంలో పెట్టారు. నేటి వరకు ట్రై సైకిళ్లను పంపిణీ చేయాలేదు. ఈ విషయంపై ఐసీడీఎస్ సీడీపీవో శారదను ఫోన్‌లో వివరణ కోరగా డీడబ్లూవో శాఖ ద్వారా ట్రై సైకిళ్ల పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందని, పరికరాలను సరి చేసే వారు రాకపోవడంతో ఎంపీడీవో కార్యాలయంలో పెట్టామన్నారు. సైకిళ్లను సరి చేసిన తర్వాతే దివ్యాంగులకు పంపిణీ చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని పాలకేంద్రం

కుంటాల, డిసెంబర్ 20: నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూరులో రూర్బన్ పథకం కింద రూ.40 లక్షలతో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రం ఇంకా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. రోజు 2వేల లీటర్ల పాలను శీతలీకరణ చేసే కెపాసిటి కలిగిన ఈ యూనిట్ వినియోగంలోకి వస్తే నిర్వహణ బాధ్యతలు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇవ్వనుండగా, లోకేశ్వరం, కుంటాల, నర్సాపూర్ మండలాల పాడి రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ సంవత్సరం మార్చిలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఈ కేంద్రాన్ని సందర్శించి త్వరగా అందుబాటులోకి తీసుకరావాలని అధికారులకు సూచించారు. అయినా ఇంత వరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదు. విజయ డెయిరీ ఉమ్మడి జిల్లా ఉపసంచాలకుడు మధుసూదన్ రావును వివరణ కోరగా యూనిట్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని ప్రజాప్రతినిధుల సమయం తీసుకొని త్వరలోనే తెరుస్తామని చెప్పారు.

కల్లూరులో ప్రారంభోత్సవానికి నోచుకోని పాల శీతలీకరణ కేంద్రం

భవన నిర్మాణానికి భూమి పూజ

దహెగాం, డిసెంబర్ 20 మండలంలోని కల్వాడ, పీపీరావు కాలనీ గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధాల దేవయ్య భూమి పూజ చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెమ్మకారి తోగయ్య, నాయకులు గందె వెంకటేశ్, కంబగొని సంతోష్‌గౌడ్, హట్కరి మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంపై ఆసక్తి చూపాలి

భీమారం, డిసెంబర్ 20 : విద్యార్థులు గణితంపై ఆసక్తి చూపాలని బూర్గుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్ సూచించారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మండలస్థాయి గణిత పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, రంగోలి, గణిత ప్రతిభా పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. మద్దికల్ ప్రాధానోపాధ్యాయుడు జాడి జనార్దన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రోయాక్టివ్ పోలీసింగ్ నిర్వహించాలి

రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 20 : నేరాల నియంత్రణకు ప్రోయాక్టివ్ పోలీసింగ్ నిర్వహించాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో మంచిర్యాల జోన్ పరిధిలోని డీసీపీ, ఏసీపీ, కింది స్థాయి అధికారులతో వార్షిక నేర సమీక్షను జూమ్ మీటింగ్ ద్వారా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి కేసును పూర్తి స్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

ప్రభుత్వ పాఠశాల సందర్శన

చింతలమానేపల్లి, డిసెంబర్ 20 : మండలంలోని బాబాసాగర్, రెబ్బెన పాఠశాలలను శుక్రవారం ఎంఈవో జయరాజ్ సందర్శించారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఈవోను సన్మానించారు.

తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న దేవాజీగూడ గ్రామస్తులు

దేవాజీగూడను బీబ్రా జీపీలోనే కొనసాగించాలి

దహెగాం, డిసెంబర్ 20 : దేవాజీగూడను బీబ్రా జీపీలోనే కొనసాగించాలని గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ కవితతో పాటు, ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలనను ఏర్పాటు చేస్తున్నందున తమ గ్రామాన్ని వేరే గ్రామాలతో కలిపి, కొత్త జీపీ చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారని పేర్కొన్నారు. తమ గ్రామాన్ని పాత జీపీ బీబ్రాలోనే కొనసాగించాలని కోరారు.

అక్రమ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు

మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్ రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 20 : అక్రమ వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత జూన్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న గుట్కా వివరాలను వెల్లడించారు. ఇప్పటి వరకు 44 కేసులు నమోదు చేసి 59 మందిని అరెస్టు చేశామని, రూ. 38,38,152 విలువ గల గుట్కాలను రికవరీ చేసినట్లు తెలిపారు.

పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 20: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి రోజూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పిల్లల ఆరోగ్యం పోషణ, విద్య పరంగా అవగాహన పెంచాలన్నారు. కేంద్రాల పనితీరు మెరుగుపరచాలన్నారు. కేంద్రాల్లో న్యూట్రిగార్డెన్స్, సామ్, మామ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు సమావేశంలో సీడీపీవోలు నాగమణి, సరిత, సరోజని, ఏసీడీపీవో నాగలక్ష్మి, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్పొరేషన్‌గా మంచిర్యాల

అసెంబ్లీలో ప్రకటించిన మంత్రి శ్రీధర్‌బాబు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 20 : మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారనున్నది. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు గురువారం అసెంబ్లీలో మంచిర్యాలను కార్పొరేషన్‌గా చేస్తున్నట్లు ప్రకటించారు. మంచిర్యాలతో పాటు, మహబూబ్‌నగర్, మరో ఆరు గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ఎన్నో రోజులుగా మంచిర్యాలవాసులు ఎదురుచూస్తున్న కోరిక నెరవేరనున్నది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు తయారు చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 పథకంలో భాగంగా నూతన మాస్టర్ ప్లాన్‌ల తయారీకోసం మంచిర్యాల మున్సిపాలిటీని ఎంపికచేశారు. ఇందులో భాగంగా ప్లాన్ తయారీ కోసం పట్టణంలోని జడ్పీ పాఠశాల మైదానం నుంచి గురువారం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ మైఖేల్‌తో కలిసి కలెక్టర్ కుమార్ దీపక్ డ్రోన్ ఏరియల్ సర్వేను ప్రారంభించారు. మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలతో పాటు, హాజీపూర్ మండలంలోని వేంపల్లి, ముల్కల, గుడిపేట, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధి గద్దెరాగడి, తిమ్మాపూర్ ప్రాంతాల్లోని కొంత భాగాన్ని కలుపుకొని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేత

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 20 : తెలంగాణ ఏక్తా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు షేక్ ముజాహిద్ మాట్లాడుతూ మహిళలకు సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మూడు బ్యాచ్‌లలో శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. నాలుగో బ్యాచ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు గుల్జార్ మజీద్ అధ్యక్షులు బషీర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమీన్‌పటేల్, రిజ్వాన్‌ఖాన్, అల్మాస్, అబ్దుల్ సాజీద్, జుబేర్, ఇమ్రాన్, ఫాజిల్, మోయిజ్, టైలరింగ్ కోచ్ రేష్మ, హీనా పాల్గొన్నారు.

మహిళ లకు సర్టిఫికెట్లు అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు